మంచి వార్త

# వేడుకలకు బర్తన్ బ్యాంక్



**కురుముండ..** ఒడిశా నౌపడా జిల్లాలోని పల్లె. ఖలేశ్వర్ గ్రామ పంచాయతీ పరిధిలోకి వస్తుంది. సాధారణంగా పెండ్లి, పుట్టినరోజు... ఇలా వేడుకలేవైనా సరే వంట సామగ్రి పెద్ద ఎత్తున అవసరం అవుతుంది. మామూలుగా అయితే టెంట్ హౌజ్ వాళ్ల దగ్గరో, ఫంక్షన్ హాలు నుంచో అద్దెకు తీసుకుంటాం. కురుముండ ప్రజలు మాత్రం వంట సామాన్లు అద్దెకు తీసుకోరు. అంతేకాదు, వేడుకల సందర్భంగా ఇక్కడ ఎవ్వరూ ప్లాస్టిక్ వస్తువులు వాడరు! పెండ్లిల్లు, ఇతర వేడుకలకు అవసరమయ్యే సామాను ఉచితంగా సమకూర్చేందుకు 'బర్తన్ బ్యాంక్' ఉండటమే దీనికి కారణం. దీన్ని ఖలేశ్వర్ సర్పంచ్ సరోజ్ దేవి ఏర్పాటుచేశారు. వేడుకలనగానే ప్లాస్టిక్ ప్లేట్లు, చెంచాలు, గ్లాసులను ఇష్టం వచ్చినట్టు వాడి పారేస్తుంటాం. దీంతో నేల, నీళ్ల కలుషితం అవుతున్నాయి. ఈ దుస్థితిని తగ్గించడానికి తమవంతుగా సరోజ్ దేవి ఇటీవలే 'బర్తన్ బ్యాంక్'కు శ్రీకారం చుట్టారు. సామాన్ల కొనుగోలు కోసం పంచాయతీ నిధుల నుంచి 75,000 రూపాయలు ఖర్చు చేశారు. వంటపాత్రలు, స్టీలు ప్లేట్లు, గ్లాసులు, గిన్నెలు, చెంచాలు పల్లెవాసులకు అందుబాటులో ఉంచారు. ''ఊళ్లలో వేడుకలప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు పెద్దమొత్తంలో పోగుపడతాయి. జనం కూడా ప్లాస్టిక్ ప్లేట్లు, చెంచాలు, గ్లాసులు లాంటి ఒక్కసారి వాడి పారేసే వాటివైపే మొగ్గు చూపుతారు. ఇదంతా డంప్ యార్డులకు చేరుకుంటుంది. ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కలిసిపోవు. దీంతో ప్లాస్టిక్ పశువుల కడుపులో చేరుకుంటున్నది'' అంటూ వివరిస్తారు సరోజ్ దేవి. ఎలాగైనా దీన్ని కట్టడి చేయాలని ఆమె సంకల్పించుకున్నారు. గ్రామస్తులతో చర్చించారు. 'బర్తన్ బ్యాంక్' రూపంలో సమస్యకు పరిష్కారం కనుక్కొన్నారు. వస్తువులను పంచాయతీ నిధుల నుంచి కొనుగోలు చేశారు. కాబట్టి, ఊరివాళ్ల దగ్గర ఒక్క పైసా కూడా అద్దెగా తీసుకోరు. వేడుకలు ముగిసిన వెంటనే పాత్రలను పరిశుభ్రంగా పంచాయతీకి తిరిగి ఇవ్వాలి. సామాన్లకు నష్టం జరిగితే మాత్రం తగిన రుసుము వసూలు చేస్తారు. కురుముండ 'బర్తన్ బ్యాంక్' వసతిని తమ పంచాయతీలోని ఇతర ఆవాసాలకూ విస్తరిస్తామని సరోజ్ దేవి పేర్కొన్నారు. మనం కూడా వేడుకల్లో స్టీలు పాత్రలను వాడితే పర్యావరణానికి ఎంతోకొంత మేలు చేసినవాళ్లం అవుతాం.

## వైతాళికుల వాణి

ఈ భూమ్మీద ఎవరూ
ఎవరికీ అపరిచితులు కాదు.
ఉన్నదల్లా మీరు ఇప్పటివరకు
కలుసుకోని మిత్రులు మాత్రమే.

• **విలియం బట్లర్ యీట్స్**
**(ప్రసిద్ధ ఆంగ్ల సాహితీవేత్త)**

## క్యా బాత్ హై!

